సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం ၊ 19 ၊ జూన్ ၊ 2023



కృత్రిమ గర్భధారణ.. పాడిరైతుకు ఆలంబన
ప్రభుత్వం జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం కింద పాడి పశువులకు ఎద సూదులను ఉచితంగా వేస్తోంది. - IIలో



డీజిల్ ట్యాంకర్ బోల్తా: డ్రైవర్ దుర్మరణం
వల్లూరు మండలం తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. - IIలో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం
అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఆరుగురు కూలీలను అరెస్ట్ చేశారు. - IIలో

న్యూస్‌రీల్

25న సాహితీ సదస్సు
కడప కల్చరల్ : నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 25న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 121వ సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉదయం 10.00 గంటలకు అమళ్లదిన్నె గోపినాథ్ జీవితం-సాహిత్యం అనే అంశంపై పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళల విభాగం విశ్రాంత ఆచార్యులు చిగిచెర్ల కృష్ణారెడ్డి ప్రసంగించనున్నట్లు తెలిపారు.

నాటా మహాసభలకు నరాలకు ఆహ్వానం


ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డికి నాటా మహాసభలకు ఆహ్వానం అందింది. ఈనెల 30, జూలై 1, 2 తేదీలలో ఉత్తర అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంలో నాటా మహాసభలు డాల్లాస్ నగరంలో జరగనున్నాయి. ఈ సభలలో ఆయన పాల్గొని ''హృద్యం- తెలుగుపద్యం'' అనే అంశంపై ప్రసంగించనున్నారు. నరాలకు నాటా సభలకు ఆహ్వానం రావడంపై పలువురు సాహితీ వేత్తలు, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు
ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 19 నుంచి జూలై 3వ తేదీ వరకు 4వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య బి. అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీస్ మేనేజ్‌మెంట్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్ కోర్సులతో పాటు కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, యానిమేషన్, స్కల్ప్చర్, ఆర్ట్ హిస్టరీ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విశ్వసాయి విద్యార్థుల విజయకేతనం


ప్రతిభ చూపిన విద్యార్థులతో విశ్వసాయి యాజమాన్యం

నెల్లూరు(టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. నెల్లూరు మాగుంట లేవుట్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఆదివారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో హృతిక్ 112, ప్రశాంత్ 1,931, తనుశ్రీ 3,315, సిసిర్‌రెడ్డి 3,508, యజ్ఞశ్రీ 892, యువదీప్ 1,521 ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంఈఓ-2 పోస్టుల భర్తీ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌లో పత్రాలను పరిశీలించుకుంటున్న ప్రధానోపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు, ఎంఈఓలకు సంబంధించి ఎంఈఓ-2 పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా సాగింది. కడప డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ బాదుల్లా, పలువురు ఎంఈఓలు పాల్గొన్నారు. మొదటి రోజు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 18 మంది ప్రధానోపాధ్యాయులకు, ముగ్గురు ఎంఈఓ-1లకు కలిపి మొత్తం 21 ఎంఈఓ-2 పోస్టులను భర్తీ చేశారు. మిగతా 30 పోస్టుల భర్తీకి 19వ తేదీ కూడా కౌన్సెలింగ్ కొనసాగించనున్నారు.

జులై 7న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు
మదనపల్లె సిటీ: మదనపల్లె టు డిపో నుంచి వచ్చే నెల 7న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు టు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. రాత్రి 8గంటలకు బయలుదేరి 8న ఉదయం ఊటీకి చేరుతుందన్నారు.

వైద్యం సూపర్.. సేవలు స్పెషల్

కడప నగరంలోని రిమ్స్‌లో వైద్య సేవలు రోగులకు మరింత అందుబాటులోకి రానున్నాయి. మానసిక వైద్యశాల, క్యాన్సర్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. త్వరలో ఈ ఆసుపత్రులు నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభం కానున్నాయి.

రిమ్స్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు
- వంద పడకల మానసిక వైద్యశాల నిర్మాణం దాదాపు పూర్తి
- వంద పడకల క్యాన్సర్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలు 80 శాతం పైగా పూర్తి
- త్వరలో అందుబాటులోకి వైద్య సేవలు



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించిన నిర్మాణ నమూనా

కడప అర్బన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తొలిరోజుల నుంచే జిల్లా అభివృద్ధికి తన వంతుగా శాయశక్తులా కృషి చేశారు. జిల్లా ప్రజలకు కడప నగర శివార్లలో పాలకొండలకు సమీపంలో దాదాపు 200 ఎకరాల్లో ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)ను నిర్మింపచేశారు. 2005-06 వైద్యవిద్యా సంవత్సరం నుంచి 150 వైద్య విద్య సీట్లతో విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను అభ్యసించడం ప్రారంభించారు. ఇప్పటికి 13 వైద్య విద్య బ్యాచ్‌లు తమ వైద్య విద్యను పూర్తి చేసుకున్నారు. రానున్న వైద్య విద్యా సంవత్సరం 2023-24లో 19వ బ్యాచ్ ప్రవేశాలు ఆగస్టులో జరగనున్నాయి.

- వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా రిమ్స్ అభివృద్ధి శరవేగంగా జరిగింది. 2009లో ఆయన చేతుల మీదుగానే రిమ్స్ ఆవరణంలో 100 సీట్ల సామర్థ్యంతో ప్రభుత్వ దంత వైద్య కళాశాల నిర్మాణం, ప్రారంభోత్సవాలు జరిగాయి. అదే ఆవరణంలో అప్పటికే నర్సింగ్ కళాశాల ఉండింది. అదే ఏడాది సెప్టెంబర్ 2న ఆయన అకాల మరణంతో తరువాత వచ్చిన కాంగ్రెస్ పెద్దలు కానీ, టీడీపీ ప్రభుత్వం రిమ్స్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. 2019లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అదే ఏడాది కడప రిమ్స్ ఆవరణంలో 100 పడకల క్యాన్సర్ హాస్పిటల్, 100 పడకల మానసిక వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ విభాగాలకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలోనే 2020, 2021 సంవత్సరాలలో కరోనా విజృంభణ జరిగింది. అయినప్పటికీ కడప రిమ్స్ ఆవరణంలో ఈ మూడు విభాగాల ఆసుపత్రుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- 2017లో 150 ఎంబీబీఎస్ సీట్ల నుంచి 200 సీట్లు పెంపుదల కోసం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆ భవనాల నిర్మాణం అప్పట్లో నత్తనడకన జరిగినా, ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణ పనులను దాదాపుగా పూర్తి చేశారు.
- సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని రూ. 125 కోట్లతో పూర్తి చేయాల్సి ఉంది. వీటిలో రూ. 75 కోట్లు సివిల్ వర్క్స్ కావడం ఈ పనులు దాదాపుగా 80 శాతం పూర్తయ్యాయి.
- 100 పడకలతో క్యాన్సర్ హాస్పిటల్‌ను రూ.107 కోట్ల వ్యయంతో నిర్మించాలని సంకల్పించారు. 30 నెలల్లో దాదాపు 80 శాతం పనులను పూర్తి చేశారు.
- మానసిక వైద్యశాలను 100 పడకల సామర్థ్యంతో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులను దాదాపుగా పూర్తి చేశారు. తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఇటీవల నిర్వహించిన కేబినెట్ సమావేశంలో ఈ వైద్యశాల పనితీరును మెరుగుపర్చేందుకు, త్వరలో ప్రారంభించేందుకు అధికారు లు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. 116 పోస్టులను కూడా మంజూరు చేశారు. దీంతో రిమ్స్ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో ప్రజలకు అందుబాటులోకి అన్ని రకాల వైద్యసేవలు


కడప రిమ్స్ ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో నిర్మాణ పనులు చేపట్టాం. రిమ్స్ ప్రారంభం నుంచి ఈ సంస్థ పర్యవేక్షణలోనే పనులు పూర్తి చేస్తున్నాం. ఆ పద్ధతిలోనే సూపర్ స్పెషాలిటీ విభాగం, క్యాన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాల నిర్మాణాలు జరుగతున్నాయి. త్వరలోనే ప్రజలకు ఆయా విభాగాల్లో సేవలను విస్తృతంగా అందించేందుకు కృషి జరుగుతోంది.

– సురేంద్రనాథ్ రెడ్డి, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ



కడప రిమ్స్‌లో మానసిక వైద్యశాలలో పూర్తయిన నిర్మాణం పనులు



కడపలో నిర్మాణంలో ఉన్న క్యాన్సర్ హాస్పిటల్



కడప రిమ్స్ ఆవరణంలో సూపర్ స్పెషాలిటీ విభాగం పనులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మెరిసిన కడప బిడ్డలు



109వ ర్యాంకు సాధించిన శ్రియ

కడప ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో నిర్వహించిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. కడప నగరానికి చెందిన ఆకేపాటి శ్రియ జాతీయస్థాయి ఓపెన్ కేటగిరిలో 109వ ర్యాంకు సాధించింది. ఆమె హైదరాబాదు మాదాపూర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఆకేపాటి శ్రియ కడప ఎర్రముక్కపల్లె వైఎస్సార్ కాలనీకి చెందిన ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, చప్పడి సుభాషిణిల ద్వితీయ కుమార్తె. తల్లిదండ్రులిద్దరూ కడప నగరపాలక ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ధర్మతేజారెడ్డికి 81వ ర్యాంకు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం రెడ్డి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఎన్‌వీ రమణారెడ్డి, తులశమ్మల కుమారుడు నిమ్మకాయల ధర్మతేజారెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎంట్రిన్స్‌లో 289 మార్కులు సాధించి అల్‌ఇండియాలో 81వ ర్యాంకు సాధించాడు. విద్యార్థికి తాతయ్య ఎన్‌వీ నారాయణరెడ్డి మిఠాయి తినిపించారు.



విద్యార్థికి మిఠాయి తినిపిస్తున్న తాతయ్య నారాయణరెడ్డి

భార్గవ్ నందన్‌రెడ్డికి 79వ ర్యాంకు



భార్గవ్ నందన్‌రెడ్డి

జమ్మలమడుగు: మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామానికి చెందిన భార్గవ్ నందన్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎంట్రెన్స్‌లో 301 మార్కు లు సాధించి జాతీయ స్థాయిలో 79వ ర్యాంకు పొందాడు. ఇటీవల తెలంగాణ ఎంసెట్ పరీక్షల్లో 23వ ర్యాంకు, ఏపీఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు. భార్గవ్ నందన్‌ను తల్లిదండ్రులు లక్ష్మీప్రసన్న, సంజీవరెడ్డిలు అభినందించారు.

ఉలసాల జయంత్‌కు 1014 ర్యాంకు



జయంత్

జమ్మలమడుగు: మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన ఉలసాల జయంత్ జాతీయ స్థాయిలో 1014 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 172వ ర్యాంకు సాధించాడు.

56వ ర్యాంకు సాధించిన నాగభవ్యశ్రీ



నాగభవ్యశ్రీ

ప్రొద్దుటూరు కల్చరల్: సాయిరాజేశ్వరి కాలనీకి చెందిన ఉపాధ్యాయులు నాగేంద్రకుమార్, ఇంద్రజల కుమార్తె నాగభవ్యశ్రీ ఆల్ ఇండియా స్థాయి లో 56వ ర్యాంకు సాధించింది. బాలికల విభాగంలో 1వ ర్యాంకు, ఓబీసీ జనరల్ విభాగంలో 8వ ర్యాంకు పొందింది.

సుశాంత్ 462వ ర్యాంకు



సుశాంత్

శ్రీనివాసనగర్‌కు చెందిన ఎం.సుబ్బారావు, సుభాషిణిల కుమారుడు మద్దాల భోగాధి సుశాంత్ 462వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి సుబ్బారావు వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేసి మరణించారు. తల్లి కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

సత్తాచాటిన నారాయణ విద్యార్థులు


ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. ఇందులో వాగ్దేవిరెడ్డి 476వ ర్యాంకు, వంశీకృష్ణారెడ్డి 546వ ర్యాంకు, సాయిగణేషశర్మ 900, తనిష్‌కుమార్‌రాజు 985 ర్యాంకులను సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నారాయణ డీజీఎం రామమోహన్‌రెడ్డి, డీన్‌లు చంద్ర కిషోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఏజీఎంలు చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంకటస్వామి, మురళీమోహన్, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి అభినందించారు.

కొనుగోళ్ల జోరు.. రైతుల హుషారు

- జిల్లావ్యాప్తంగా ఆరు కొనుగోలు కేంద్రాల ద్వారా పసుపు విక్రయాలు
- ప్రతి రైతు వద్ద నుంచి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు
- క్వింటాకు రూ. 6850 మద్దతు ధర



మైదుకూరు కొనుగోలు కేంద్రంలో పసుపును తూకాలు వేస్తున్న అధికారులు

కడప అగ్రికల్చర్: రైతు సుభిక్షంగా ఉంటే రాజ్యం సుభిక్షంగా ఉంటుందనే నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అన్ని రకాల సేవలను అందిస్తోంది. మొన్నటి వరకు శనగలు కొనుగోలు చేసిన ప్రభుత్వం తాజాగా పసుపును కొనుగోలు చేస్తుంది. బహిరంగ మార్కెట్ కంటే అదనపు ధరను కల్పిస్తోంది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జోరుగా కొనుగోళ్లు...

జిల్లాలో పసుపు కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఈ నెల 2వ తేదీన జిల్లాలో పసుపు కొనుగోలును ప్రారంభించారు. జిల్లాలో సిద్దవటం, పోరుమామిళ్ల, మైదుకూరు, ఖాజీపేట, జమ్మలమడుగు, పెండ్లిమర్రి మండలాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఆరు కేంద్రాల ద్వారా 5556 మెట్రిక్ టన్నుల పసుపు కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారు. పసుపు కొనుగోలు ప్రారంభ సమయంలో బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు పసుపు ధర రూ. 4200 నుంచి రూ.4600 వరకు ఉండగా ప్రభుత్వం మాత్రం క్వింటాలుకు రూ. 6850 మద్దతు ధరను ప్రకటించి కొనుగోలు ప్రారంభించింది. అంటే బహిరంగ మార్కెట్ కంటే దాదాపు రూ. 2500 అదనపు ధరతో పసుపును కొనుగోలు చేసింది.

ఇప్పటి వరకు 875 మెట్రిక్ టన్నులు కొనుగోలు


ఇప్పటి వరకు జిల్లాలో 414 మంది రైతుల వద్ద నుంచి 875 మెట్రిక్ టన్నుల పసుపు కొనుగోలు చేశారు. ప్రతి రైతు వద్ద నుంచి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం పసుపు కొనుగోలుకు రైతుల నమోదు ప్రక్రియను రాష్ట్రంలోనే మన జిల్లాలో మొదటిసారిగా మార్చి 28వ తేదీ నుంచి ప్రారంభించింది. ఆ సమయంలో బహిరంగ మార్కెట్‌లో పసుపు క్వింటాలు రూ. 4200 నుంచి రూ.4600 వరకు ఉండగా ప్రభుత్వం మాత్రం క్వింటాలుకు రూ. 6850 మద్దతు ధరను ప్రకటించి కొనుగోలును ప్రారంభించింది. బయట మార్కెట్ కంటే ప్రభుత్వ ధర అధికంగా ఉండటంతో బహిరంగ మార్కెట్‌లో కూడా ధరను పెంచాల్సి వచ్చింది. దీంతో క్వింటాలు రూ. 5300 నుంచి రూ.5500 వరకు చేశారు. ఈ ధర ప్రస్తుతం రూ. 6400 వరకు పెరిగింది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే బహిరంగ మార్కెట్ ధర కూడా పెరగడంతో ఇంకా ధర పెరుగుతుందేమోనని రైతులు పసుపు విక్రయాలను కొంత నెమ్మదించారు.

జిల్లాలో పసుపు సాగు చేసిన రైతులు:	4122
జిల్లాలో సాగైన పసుపు ఎకరాల్లో:	4783.500
దిగుబడి అంచనా:	16120 మెట్రిక్ టన్నులు
ప్రభుత్వం పసుపు కొనుగోలు టార్గెట్:	5556 మెట్రిక్ టన్నులు
పసుపు విక్రయం కోసం రిజిస్టర్ చేసుకున్న రైతులు:	2362
పసుపు కొనుగోలుకు ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాలు:	06
ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పసుపు:	875 మెట్రిక్ టన్నులు

రైతులకు మేలు జరుగుతుంది



గతంలో మాదిరిగా కాకుండా జగనన్న ప్రభుత్వంలో కొనుగోలు ప్రక్రియ రైతులకు మేలు చేసే విధంగా ఉంది. ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చిన వెంటనే కొనుగోలు ప్రారంభించడం చాలా ఉపయోగకరంగా ఉంది. రైతు పండించిన ఉత్పత్తులు ఆలస్యంగా కొనుగోలు చేస్తే దళారీలు బాగుపడేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. రైతులకు మేలు జరుగుతుంది.

– గూడూరు దస్తగిరి, కేతవరం, చాపాడు మండలం

28 క్వింటాళ్లు విక్రయించా



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నేను 28 క్వింటాళ్ల పసుపును విక్రయించాను. నేను ఎకరాలో పసుపును సాగు చేస్తే 28 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో నాకు మేలు జరిగింది.

– కొల్లు శ్రీనివాసులునాయుడు, దువ్వూరు

కొనుగోలు కేంద్రంలోనే అమ్మేశా


నేను ఎకరా 25 సెంట్లలో పసుపును సాగు చేశా. నాకు 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ అనుమతుల ప్రకారం ప్రతి రైతు 30 క్వింటాళ్ల విక్రయం చేసుకో వచ్చని నిబంధన ఉండటంతో నా పసుపంతా ఇక్కడే అమ్ముకున్నా. దీంతో నాకు బయటికి తరలించేందుకు అయ్యే ఖర్చులన్నీ తగ్గిపోయాయి. చాలా సంతోషంగా ఉంది.

– సన్నపురెడ్డి లక్ష్మిరెడ్డి, సిద్ధవరం గ్రామం, పోరుమామిళ్ల మండలం

30 వరకు గడువు


పసుపు కొనుగోలుకు సంబంధించి ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉంది. పసుపును అమ్ముకునే రైతులు ఉంటే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావచ్చు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల మేరకే కొనుగోలు చేస్తాం. ఈ విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి.

– తాడిగొట్ల నరసింహారెడ్డి, డీఎం, మార్క్‌ఫెడ్

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ రేపు


మూడు తరాల ప్రజాసారథి పుస్తకం

మైదుకూరు : మైదుకూరు శాసనసభ్యులు, సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి జీవిత చరిత్ర ''మూడు తరాల ప్రజాసారథి'' పుస్తకావిష్కరణ మైదుకూరులో మంగళవారం జరగనుంది. నాలుగు దశాబ్దాలుగా మైదుకూరు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన శెట్టిపల్లె రఘురామిరెడ్డి రాజకీయ జీవితంలోని అనేక ఘట్టాలతో డాక్టర్ తవ్వా వెంకటయ్య రచించిన పుస్తకాన్ని స్థానిక నంద్యాల రోడ్డులోని కేఎస్‌సీ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించనున్నారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానముల చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరుకానున్నారు. విశిష్ట అతిథులుగా ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఐరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

క్లుప్తంగా

రేసు కుక్కల దాడిలో గేదె మృతి

అట్లూరు : మండల పరిధిలోని పెద్దకామస ముద్రం గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం మేతకు వెళ్లిన గేదెలపై అడవి నుంచి వచ్చిన రేసుకుక్కలు దాడి చేశాయి. అటుగా పొలాలవైపు వెళ్లిన కొంత మంది రైతులు గమనించి వాటిని తరిమేశారు. అయితే అప్పటికే ఒక గేదె మృతి చెందింది. అటవీ అధికారులు రేసుకుక్కలు గ్రామాల వైపు రాకుండా చర్యలు చేపట్టాలని. లేకపోతే వేలాది రూపాయల విలువైన మూగజీవాలను భక్షిస్తాయని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని వెంపల్లె రోడ్డులో అక్రమంగా రెండు ఆటోల్లో తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను పోలీసులు పట్టుకున్నారు. వాహనాలు తనిఖీల్లో భాగంగా రెండు ఆటోలను తనిఖీ చేయగా అందులో 23 బస్తాలు 920 కిలోల బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చాపాడు మండలానికి చెందిన ఎల్లయ్యను, వల్లూరు మండలానికి చెందిన నరసింహులు, కమలాపురం మండలానికి చెందిన మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రెండు ఆటోలను సీజ్ చేసినట్లు చెప్పారు.

తల్లిపై కట్టెలు, రాళ్లతో దాడి

రామాపురం : కల్పనాయునిచెరువు పంచాయతీలోని అగ్రహారంలో ఈనెల 4వ తేదీన గోవింద్ చిన్నక్కపై ఆమె పెద్ద కుమారుడు వెంకటేశు, అతని భార్య నాగమ్మ కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు నాగమ్మకు ఇద్దరు కుమారులు వెంకటేశు, చిన్న వెంకటేశులకు రెండు ఇళ్లు కట్టించింది. నాగమ్మ కాపురం ఉంటున్న ఇంటిపై పెద్ద కుమారుడు కన్ను వేశాడు. ఆ ఇల్లు ఇవ్వలేదని దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. చికిత్స కోసం చిన్నకుమారుడు చిన్న వెంకటేశు కడప రిమ్స్‌కు తరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఐ తెలిపారు.

కృత్రిమ గర్భధారణ..పాడిరైతుకు ఆలంబన

- పాల దిగుబడులను పెంచడమే ధ్యేయంగా జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం (ఎన్ఏఐపీ)
- జూలై చివరి వరకు పాడి పశువులకు ఉచితంగా ఎద సూదులు



పశువులకు ఎద సూదులు వేస్తున్న పశువైద్యులు

వల్లూరు : వ్యవసాయం తరువాత అంతే ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయానికి అనుబంధంగా ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్న పాడి పశువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పాడి రైతులకు తోడ్పాటు నందించి రైతుల ఆర్థిక స్వయం సమృద్ధి సాధనకు కృషి చేస్తోంది. అందులో భాగంగా జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం కింద ఏప్రిల్ మాసం నుంచి జూలై మాసం చివరి వరకు పాడి పశువులకు ఎద సూదులను ఉచితంగా వేస్తోంది.

■ 2018 సంవత్సరంలో రాష్ట్రంలోని వైఎస్ఆర్ జిల్లాతో బాటు విశాఖ పట్టణం, విజయనగరం జిల్లాలను క్రిషి కళ్యాణ్ అభియాన్ కింద ఎంపిక చేశారు. ఈ పథకం కింద ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని 25 గ్రామాలను ఎంపిక చేసి పాడి పశువులకు ఉచితంగా ఎద సూదులను వేయడం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. మూడు నెలల పాటు గ్రామానికి 300 చొప్పున ఎద సూదులను ఉచితంగా వేశారు. అనంతరం అదే సంవత్సరంలో క్రిషి కళ్యాణ్ అభియాన్ -2 కింద జిల్లాలోని 75 గ్రామాల్లో పథకాన్ని అమలు చేశారు. 2019లో క్రిషి కళ్యాణ్ – 3 కింద జిల్లాలోని 100 గ్రామాల్లో పథకాన్ని అమలు చేసి కొన్ని నెలల పాటు పరిమిత సంఖ్యలో ఉచితంగా ఎద సూదులను వేశారు.

జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం

ప్రస్తుతం జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం (ఎన్ఏఐపీ) కింద ఈ పథకాన్ని అమలు చేయడానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిధిలో ఉన్న గ్రామాలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ నెల 1 వ తేదీ నుంచి జులై 31 వరకు రాష్ట్రంలోని ప్రతి పాడి పశువుకు ఉచితంగా ఎద సూదులను వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 497 కేంద్రాల ద్వారా అమలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 497 కేంద్రాల ద్వారా పథకం అమలవుతోంది. 24 పశు వైద్య శాలలు, 113 డిస్పెన్సరీలు, 107 గ్రామీణ పశు వైద్య శాలలు, ఒక సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాల, ఒక బహుళార్థ పశు వైద్య శాల, 112 మంది గోపాల మిత్రలు, 139 ఆర్‌బీకేల ద్వారా పథకాన్ని అమలు చేస్తున్నారు.

ఒక్కో పశువుకు రెండు ఎద సూదులు ఉచితం

పథకం కింద ట్యాగ్ కలిగిన ప్రతి పాడి పశువుకు ఉచితంగా ఎద సూదులను వేస్తారు. ఒక రైతుకు ఎన్ని పాడి పశువులు ఉన్నా అన్నింటికీ పథకం కింద ఉచితంగా ఎద సూదులు వేస్తారు. ఒక్కో పాడి పశువుకు 21 రోజుల వ్యవధితో మొదటి రెండు ఎద సూదులను ఉచితంగా వేస్తారు. తరువాత వేసే ఒక్కో ఎద సూదికి రూ. 40 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ ఒకే రోజు ఒకే పశువుకు రెండు ఎద సూదులు వేయాల్సి వస్తే మొదటిది ఉచితంగా వేసి, రెండవ దానికి రూ. 40 వసూలు చేస్తారు. కాగా గోపాల మిత్రల ద్వారా వేసే ఎద సూదులకు సంబంధించి సూది ధర రూ. 40 పోనూ మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

రైతులకు ఖాళీ నాళిక (స్ట్రా) లు

పథకం కింద పాడి పశువులకు ఉచితంగా ఎద సూదులను వేసిన అనంతరం సూదికి సంబంధించిన ఖాళీ నాళిక (స్ట్రా) ను రైతుకు అందజేస్తారు. దీంతోపాటు రూ. 0 రుసుముతో రసీదును నమోదు చేసి రైతుకు ఇస్తారు. ఈ పథకం కింద వేసిన ఎద సూదులకు సంబంధించి పశు వైద్య సిబ్బంది ఇనాఫ్ పోర్టల్‌లో 100 శాతం నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్, మే నెలల్లో వేసిన మొత్తం ఎద సూదులు	29,141
ఈ పథకం కింద ఉచితంగా వేసిన ఎద సూదులు	17,252
జిల్లాలోని ఆవులు	138132
గేదెలు	457507

పుంగనూరు జాతి ఎద సూదులకు పథకం వర్తించదు

కాగా పుంగనూరు జాతి పశువుల ఎద సూదులకు ఈ పథకం వర్తించదు. దాంతో పాటు పెయ్య దూడల ఉత్పత్తి పథకం కింద వేసే లింగ నిర్ధారిత వీర్య సూదులకు సైతం ఈ పథకం వర్తించదు. వాటికి మాత్రం యథావిధిగా రుసుము చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన ముర్రా, ఒంగోలు, గిర్, సాహివాల్, హెచ్ఎఫ్, జర్సీ మొదలైన జాతుల పశు ఎద సూదులు ఉచితంగా వేస్తారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు ఆర్థిక భారాన్ని తగ్గించి, ప్రోత్సహించడం ద్వారా పాల దిగుబడులను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకం కింద ఏప్రిల్ నుంచి జులై చివరి వరకు ఉచితంగా ఎద సూదులను వేస్తోంది. పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రైతులు పాడి పరిశ్రమపై శ్రద్ధ తీసుకుంటే అధిక పాల దిగుబడులను సాధించడం ద్వారా మంచి లాభాలను పొందడానికి అవకాశం ఉంది.

-డాక్టర్ జి. రమేష్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డీఎల్‌డీఏ, కడప

ఏడుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

కొండాపురం : ఖైదీ పరారు విషయంపై డీఐజీ ఆదేశాల మేరకు ఎస్పీ కేకే అన్బురాజన్ ఏడుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ జైలులో రిమాండ్ ఖైదీ ఎం.నాగిరెడ్డిని కొండాపురంలో ఓ దొంగతనం కేసుపై జమ్మలమడుగు కోర్టులో ప్రవేశపెట్టారు. తిరిగి ధార్వాడ జైలుకు తీసుకెళుతుండగా గురువారం రాత్రి కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈ విషయంపై కడప ఎఆర్ ఏఎస్ఐ సుధాకర్, ఎఆర్‌పీసీ నాయక్, ఏఆర్‌పీసీ దేవానంద్, కొండాపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ ఉత్తమ్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్‌రెడ్డి, రాంబాబు, పి.వి రమణలను సస్పెండ్ చేశారు. పరారైన ఎం. నాగిరెడ్డి పై సుమారు 90 కేసులు ఉన్నట్లు సమాచారం.

ఒంటిమిట్టలో చోరీ

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని చెరువుకు సమీపంలో ఉన్న జిలాని అనే వ్యక్తి నివాస గృహంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు జిలాని భార్య అనారోగ్యం కారణంగా 15 రోజుల నుంచి తిరుపతి లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఒంటిమిట్ట లోని తన గృహంలో ఎవరూ లేని సమయం చూసి శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా పగులగొట్టి రూ. 30వేల నగదు, ఒక వెండి ఆభరణం, దొంగలించినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



దుంగలు,నిందితులతో డీఎస్పీ మహబూబ్‌బాషా, పోలీసు అధికారులు

వాల్మీకిపురం : అక్రమంగా తరలిస్తున్న 3 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఆరుగురు కూలీలను అరెస్ట్ చేసిన సంఘటన వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకొంది. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా కథనం మేరకు..ఆదివారం ఉదయం మండలంలోని విఠలం పాదాలగుడి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తిరుపతి నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న టీఎన్02 యు0696 నంబరు గల ఇన్నోవా వాహనం వేగంగా వెళ్లింది. దీంతో ఎస్ఐ నాగేశ్వర రావు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. వాహనాన్ని అడ్డుకోగా డ్రైవర్ పరారయ్యాడు. రూ. 4లక్షలు విలువ చేసే మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు కూలీలను అరెస్ట్ చేసి, ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై ప్రాంతానికి చెందిన విమల్ రాజ్ (28), కేసవన్ (30), రాజేంద్రన్ (31), రజిత్‌కుమార్ రాజ శంకర్ (24), తిరుపతి (41), గోవింద రాజ్ (29)లు కలసి శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం దుంగలను అక్రమంగా బెంగళూరు సమీపంలోని కటికనహళ్లికి తరలిస్తుండగా దాడి చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితులను, ఎర్రచందనాన్ని పట్టుకున్న ఎస్ఐ నాగేశ్వర రావు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ సురేష్ కుమార్, అదనపు ఎస్సై క్రిష్ణమూర్తి, సిబ్బంది మోహన, దస్తగిరి, రెడ్డిప్రసాద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటాక్‌ను దేశంలో నంబర్ వన్‌గా నిలుపుదాం



ఇంటాక్ నూతన కన్వీనర్‌ను సత్కరిస్తున్న రాయలసీమ టూరిజం సంస్థ సభ్యులు

కడప కల్చరల్ : భారత జాతీయ కళావారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్)ను వారసత్వ పరిరక్షణలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా వాసులంతా కృషి చేద్దామని జిల్లా బీసీ వెల్ఫేర్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఇంటాక్ కడప చాప్టర్ భవిష్యత్ కార్యాచరణపై ఆదివారం స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ కడప ఇంటాక్ చాప్టర్ నూతన కన్వీనర్‌గా కె.చిన్నపరెడ్డి బృందం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే జిల్లాకే తలమానికంగా నిలిచిన పాత కలెక్టరేట్ భవనాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించడం శుభపరిణామమన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం వేగాన్ని చూస్తే సంస్థ స్థాయిని పెంచగలరన్న నమ్మకం ఏర్పడుతోందన్నారు. బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ నూతన సభ్యుల్లో వారసత్వ సంపద, చరిత్రలపై అవగాహన గలవారున్నారని, జిల్లాలో సంస్థకు మంచి పేరు సాధించి పెట్టగలరన్న ఆశ ఉందన్నారు. విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్‌రెడ్డి స్మారక ట్రస్టు చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ కలెక్టరేట్‌కు పూర్వ వైభవం కల్పించేందుకు ఇంటాక్ కొత్త కమిటీ చేస్తున్న ప్రయత్నం ఫలించాలని ఆకాంక్షించారు. ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ తమ శక్తియుక్తులను ఇంటాక్‌ను ఉత్తమ స్థాయికి తెచ్చేందుకు వినియోగిస్తామని తెలిపారు. లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు జోజిరెడ్డి, ప్రస్తుత కార్యదర్శి లయన్ గౌరీశంకర్, హచ్ రవి, డాక్టర్ జీవీ సాయిప్రసాద్, గ్రాండ్ ఇన్ చిన్నప్పరెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరాచారి, స్వరూపరాణి, యల్లారెడ్డి, బ్యాంకు అధికారి శైలేంద్రనాథ్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్, కో కన్వీనర్లను రాయలసీమ సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



వెంకటేష్ మృతదేహం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని నిడుజివ్వి గ్రామ సమీపంలో వేస్ట్ మెటీరియల్ లోడింగ్ చేస్తుండగా టిప్పర్ ఢీకొని నత్తి గంగులయ్యగారి వెంకటేష్(49) దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చేటుచేసుకుంది. ఎర్రగుంట్ల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు చిలంకూరు గ్రామంలోని రామాలయం వీధిలో నివాసం ఉండే నత్తి గంగులయ్యగారి వెంకటేష్ నిడుజివ్వి గ్రామం సమీపంలోని తులసిరెడ్డి గని సమీపంలో వేస్ట్ మెటీరియల్ చేసే చోట సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వెనక్కు వెళ్లి వెంకటేష్‌ను ఢీకొన్నాడు. అతను రాళ్లపై పడి తీవ్రంగా గాయపడ్డాడు.. వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కంటైనర్ ఢీకొని ..

ఓబులవారిపల్లి : అన్నమయ్య జిల్లా రెడ్డిపల్లె చెరువు కట్టపై ఆదివారం తెల్లవారుజామున కంటైనర్ ఢీ కొనడంతో జె పురుషోత్తం(51) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం గ్రామానికి చెందిన పురుషోత్తం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు ఇన్నోవా వాహనంలో బయలుదేరారు. రెడ్డిపల్లె చెరువుకట్టవద్ద వాహనం టైరు పంచర్ కావడంతో జాతీయ రహదారి ప్రక్కన నిలిపి డ్రైవర్ సాయికుమార్ టైరు మార్చుతుండగా పురుషోత్తం టార్చిలైట్ వేస్తున్నాడు. ఈ సమయంలో తిరుపతివైపునకు వస్తున్న భారీ కంటైనర్ ఇన్నోవా వాహనాన్ని వెనుక నంచి ఢీకొని పురుషోత్తం పై నుంచి దూసుకెళ్లింది. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పురుషోత్తం కళ్యాణ దుర్గంలో చింతపండు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



గాయపడిన కడపకు చెందిన సుబ్బరాయుడు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కడప పట్టణంలోని అల్మాస్‌పేటకు చెందిన సుబ్బరాయుడు (60), భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఎస్.మహబూబ్‌బాషా (53) ఇద్దరూ కలిసి ఆదివారం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ రామిగానిపల్లె వద్ద అకస్మాత్తుగా వీరి వాహనానికి కోతి అడ్డుగా రావడంతో అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన ఖాజా (19) ఐటీఐ చదివి యమహా షోరూంలో పని చేస్తున్నాడు. ఆదివారం పట్టణంలోని హోటల్ నుంచి భోజనం తీసుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా నీరుగట్టువారిపల్లె రింగ్‌రోడ్డు వద్ద కుక్క అడ్డుగా రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు.

కొండచిలువ హల్‌చల్

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం కొండచిలువ హల్ చల్ చేసింది, గ్రామంలో కుమ్మరి వీధిలోకి వచ్చి కుక్కను మింగతుండగా గ్రామస్తులు, యువకులు చూసి కొండచిలువను కొట్టి చంపారు.

యువతిపై అత్యాచారం కేసులో యువకుడి అరెస్ట్

మదనపల్లె : ప్రేమపేరుతో దళిత యువతిని వంచించి అత్యాచారం చేసిన కేసులో యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఎస్.సుధాకర్ తెలిపారు. పట్టణంలోని కమ్మగడ్డవీధి ఎక్స్‌టెన్షన్‌లో నివాసం ఉంటున్న ఎన్.తేజస్వినిని ఎస్‌బీఐ కాలనీకి చెందిన రామ్‌చరణ్‌నాయుడు పదినెలలుగా ప్రేమించి, పెళ్లిచేసుకుంటానని నమ్మించి బెంగళూరు తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి ఆమెతో సహజీవనం చేశాడు. పెళ్లి చేసుకోమని యువతి కోరడంతో నిరాకరించాడు. అంతేకాకుండా ఆమెవద్ద తీసుకున్న రూ.5.5లక్షలు తిరిగి చెల్లించాల్సిందిగా ఆమె కోరితే రామచరణ్‌నాయుడు కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి యువతిని కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేశారు. దీంతో తేజస్విని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా నిందితులపై టూటౌన్ సీఐ మురళీకృష్ణ మోసం, అత్యాచారం, దౌర్జన్యానికి సంబంధించి వివిధ సెక్షన్ల కింద ఎస్సీ,ఎస్టీ కేసు నమోదుచేశారు. కేసును ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాలతో మదనపల్లె ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ సుధాకర్ విచారించారు. అందులో భాగంగా నిందితుడిపై నేరం నిర్ధారణ కావడంతో టీటీడీ కల్యాణమండపం వద్ద రామ్‌చరణ్‌నాయుడిని అరెస్ట్ చేసి, మదనపల్లె ఫస్ట్ అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు వద్ద హాజరుపరచగా, మేజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

డీజిల్ ట్యాంకర్ బోల్తా: డ్రైవర్ దుర్మరణం



బాబా ఫకృద్దీన్ మృతదేహం

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలంలోని తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన ఓనర్ కమ్ డ్రైవర్ షేక్ బాబా ఫకృద్దీన్ (47) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ పెద్ద ఓబన్న కథనం మేరకు ఎర్రగుంట్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన షేక్ బాబా ఫకృద్దీన్ కర్ణాటక రాష్ట్రం నుంచి డీజిల్ లోడుతో బయలు దేరాడు. వల్లూరు మండల పరిధిలోని తప్పెట్ల సమీపంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద వారు ప్రయాణిస్తున్న డీజిల్ ట్యాంకర్ టైరు పంక్చరైంది. దీంతో వాహనం అదుపు తప్పి డ్రైవర్ వైపునకు బోల్తా పడింది. వాహనం కింద పడి నలిగిపోయిన డ్రైవర్ బాబా ఫకృద్దీన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ షాహిద్ సురక్షితంగా బయట పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ పెద్ద ఓబన్న సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాహనాల రాక పోకలను పునరుద్ధరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జహీర్ సాహెబ్ మృతదేహం

కమలాపురం : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న షేక్ జహీర్ సాహెబ్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి జహీర్ ఇంట్లో కింద పడిపోయాడని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జహీర్ ఆరేళ్ల క్రితం కొలిమి వీధికి చెందిన షేక్ యాస్మిన్‌ను వివాహం చేసుకున్నాడు. ఇటీవల వారి మధ్య కలహాలు ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో జహీర్ మృతి చెందడం అనుమానాస్పదంగా మారింది. గొంతు కింద చారలు ఉండటంతో కుటుంబ సభ్యులే అతడిని తాడుతో గొంతు నులిమి చంపారా? లేక అతడే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా మృతుని తండ్రి దస్తగిరి తన కుమారుడిది ఆత్మహత్య కాదని, తన కోడలు, వారి అమ్మ, చెల్లెలు కలిసే చంపినట్లు అనుమానంగా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి చిన్న వయస్సు గల ముగ్గురు కుమారులు ఉన్నారు. జహీర్ మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

దళితుల మధ్య చిచ్చుపెడుతున్న టీడీపీ నేత



గాయపడిన వారిని పరామర్శిస్తున్న దండుగోపి, దాసరి పెంచలయ్య

రాజంపేట (అన్నమయ్యజిల్లా) : మండలంలోని కొల్లవారిపల్లెలో దళితుల మధ్య టీడీపీ రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు చిచ్చుపెట్టి చలికాచుకుంటున్నాడని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, జిల్లా ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దాసరి పెంచలయ్య ధ్వజమెత్తారు. ఆదివారం రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో టీడీపీనేత ప్రోద్బలంతో గాయపడిన మన్నెం జయరామయ్య, ఈశ్వరయ్యలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దళితుల భూములను లాక్కొని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మొన్న మొన్న వరకు అన్నదమ్ముల్లా ఉన్న దళితులు చీలిపోయారన్నారు. దళితులకు సంబంధించి భూ సమస్యలలో జోక్యం చేసుకొని, చివరికి దళితులపై దాడి జరగడానికి కారకుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఆరోపించారన్నారు. ఇప్పటికే గ్రామీణప్రాంతాల్లో ఇతని ఆగడాలు అన్ని ఇన్నీ కావన్నారు. బాధితులు జయరామయ్య, ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కొల్లవారిపల్లె హరిజనవాడ వాసుల మధ్య టీడీపీ నాయకుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు స్వార్థరాజకీయాలకు మేము కొట్టుకొనే పరిస్థితులను కల్పించారని ఆరోపించారు. ఆయనపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. తమపై దాడి చేసిన హరినాథ్, మల్లికార్జున, శంకరయ్య, గుండాల హరిలపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ నేత సుబ్బనరసయ్యనాయుడు పిలవడం వల్లే మేము గొడవ పడాల్సి వచ్చిందని గుడిసెహరినాథ్ అవేదన చెందారు.

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వ మానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఐక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం తరువాత విశ్వ మానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే 'సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికిప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!

నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హి ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.



పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మ బంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంతకన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం

ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.



ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు.

అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా


రవితేజ

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!


మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

మా నాన్న సూపర్ హీరో!


సుధీర్‌బాబు


'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?


రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత


అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

సంక్రాంతికి జాతర


ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.